# మత విద్వేషాన్ని ఓడించండి
# ఉగ్రవాదాన్ని మట్టుబెట్టండి



ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

# మత విద్వేషాన్ని ఓడించండి
# ఉగ్రవాదాన్ని మట్టుబెట్టండి

**2025** ఏప్రిల్ 22న కశ్మీర్ రాష్ట్రంలోని పహాల్గాంలో ఉగ్రవాదులు జరిపిన ముష్కరదాడిలో 25 మంది భారతీయులు, 1 నేపాల్ దేశస్థుడు మరణించారు. చనిపోయిన 25 మంది భారతీయులలో 24 మంది వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పర్యాటకులు కాగా, ఒకరు స్థానిక గుర్రపు రౌతు. బాధితుల మతాన్ని తెలుసుకొని ఒకర్ని తప్ప అందర్ని చంపారు.

ఈ దారుణ మారణకాండను జమ్ము-కశ్మీర్ సహా యావత్ భారత ప్రజానీకం తీవ్రంగా ఖండించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ దుర్ఘటనను ఖండిస్తూ ప్రకటనలు ఇచ్చారు. ఈ దాడి గతంలో అనంతనాగ్ (2000), ముంబై (2008), యూరి (2016), పుల్వామా (2019)లో జరిగిన ఉగ్రవాద దాడులను గుర్తుకు తెస్తుంది.

ఈ ఉగ్రవాద దాడుల వెనుక లష్కర్-యే-తోయిబా, జైష్-ఎ-మొహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలతో పాటు పాకిస్థాన్ సైన్యం, ఇంటర్‌సర్వీస్ ఇంటిలిజెన్స్ (ఐ.యస్.ఐ)ల ప్రచ్ఛన్న హస్తం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు నివేదించాయి.

పహాల్గాం ఉగ్రదాడిని జమ్ముకాశ్మీర్ ప్రజలు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ఆ మరుసటి రోజునే - ఏప్రిల్ 23- కశ్మీర్‌లోని అన్ని పట్టణ ప్రజానీకం స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పర్యాటకులను ఉగ్రవాద దాడుల నుండి రక్షించే క్రమంలో 29 ఏళ్ళ కశ్మీర్ యువకుడు ఆదిల్ హుస్సేన్‌షా ప్రాణాలు కోల్పోయాడు. "పర్యాటకుల ప్రాణాలు కాపాడే క్రమంలో ఆదిల్ అసువులు బాసాడు. 'కశ్మీరియత్'కు నిలువెత్తు అర్ధంగా నిలిచాడు" అని ఆదిల్ తండ్రి వివరించాడు. 'ఉగ్రవాదులు కాల్చిన తుపాకి గుళ్ళు ఎక్కుపెట్టింది పర్యాటకుల మీద మాత్రమే కాదు, మా గుండెల మీద' అని శ్రీనగర్‌లోని టాక్సీ డ్రైవర్ అష్రాఫ్ పేర్కొన్నాడు.

2019లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్టికల్ 370, 35ఎలను రద్దు చేసి జమ్ము-కశ్మీర్ స్వయంప్రతిపత్తిని కాలరాచి, కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి అక్కడి ప్రజల ఆకాంక్షలను చిదిమివేసినా, ఉగ్రవాద అణిచివేత పేరిట కశ్మీర్ ప్రజానీకంపై తీవ్ర నిర్బంధాలకు పాల్పడుతున్నా ఉగ్రవాద దాడులను కశ్మీర్ ప్రజానీకం ముక్తకంఠంతో నిరసించింది.

ఇందుకు బదులుగా కశ్మీర్ ప్రజానీకానికి ఏం దక్కింది? కేంద్ర ప్రభుత్వం అనుమానితుల పేరిట వేలాదిమంది కశ్మీర్ యువకులను అరెస్టు చేసి జైళ్ళ పాల్జేసింది. అనుమానిత ఉగ్రవాదుల పేద కుటుంబాల నివాసాలను బుల్‌డోజర్లతో ధ్వంసం చేసింది. ఆర్.యస్.యస్., బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు ఈ ఘటనను సాకుగా తీసుకుని బిజెపి పాలిత రాష్ట్రాల్లో వందలాది మంది కశ్మీర్ విద్యార్థులను తీవ్ర వేధింపులకు గురిచేసి కాలేజీలు, హాస్టళ్ళ నుండి తరిమివేసారు. కశ్మీర్ చిరువ్యాపారస్థుల షాపులు, ఇళ్ళు లూటీ చేసారు. మత విద్వేషాల్ని రెచ్చగొట్టి ముస్లింల మీద దాడులు జరిపారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో బిర్యానీ షాపులో పనిచేసే ఒక ముస్లిం యువకుడిని హత్య చేసారు.

కానీ ఈ రోజు వరకు మోడీ ప్రభుత్వం పహల్గాం నిందితులలో ఒక్కరిని కూడా నిర్బంధించలేకపోయింది. అంతెందుకు ఆరేళ్ళక్రితం పుల్వామాలో జరిపిన ఉగ్రదాడిలో మన సైనికుల నిండు ప్రాణాలు తీసిన ఉగ్రవాదులలో ఒక్కరిని కూడా మోడీ ప్రభుత్వం పట్టుకోలేకపోయింది. ఏప్రిల్ 7,8 తేదీలలో కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా శ్రీనగర్ వచ్చి కశ్మీర్‌లో భద్రతా వ్యవహారాలను సమీక్షించారు. శ్రీనగర్‌లోని ఏకీకృత ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి సైన్యం, సరిహద్దు భద్రతా బలగాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు, జమ్ము-కశ్మీర్ పోలీస్ విభాగాల నుంచి అత్యున్నతాధికారులు హాజరయ్యారు. కానీ విచిత్రంగా కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను ఈ సమావేశానికి ఆహ్వానించలేదు. ఈ సమావేశానంతరం అమిత్‌షా మాట్లాడుతూ

'మోడీ ప్రభుత్వం నిరంతరం అత్యంత సమన్వయపూరకంగా చేస్తూ వచ్చిన కృషి మూలంగా జమ్ము-కశ్మీర్‌తో, భారతదేశంతో శతృపూరితంగా వ్యవహరిస్తున్న యావత్ ఉగ్రవాద అనుకూల శక్తుల పీచం అణిచివేసాం' అని గొప్పలు చెప్పుకొచ్చారు. 15 రోజులు తిరగకుండానే పహల్‌గాంలో జరిగిన ఉగ్రవాద దాడి యావద్భారతాన్ని ఆందోళనకు గురిచేసింది.

ఇలాంటి డంబాలు ప్రచారం చేసుకోవడం మోడీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వానికి కొత్తకాదు. 2016లో పెద్దనోట్ల రద్దును ప్రకటిస్తూ 'ఇది ఉగ్రవాదులకు నిధులు అందకుండా చెయ్యడానికి ప్రయోగించిన మిస్సైల్ వంటిది' అని చెప్పుకొచ్చారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం పెరుగుదలకు తోడ్పడుతున్నాయి కాబట్టే ఆర్టికల్ 370, 35 'ఎ'లను రద్దు చేసాం అని ప్రకటించారు.

ఉగ్రవాద పెరుగుదలను నిరోధించడానికే 2019లో యావత్ కశ్మీర్ రాష్ట్రాన్ని నిర్బంధంలో ఉంచాం అని మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించింది. యూరి, పుల్వామా ఉగ్రవాద ఘటనలకు ప్రతీకారంగా బాలాకోట్ మీద సర్జికల్ దాడులు చేసి సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేసాం అని విజయోత్సాహంతో ప్రకటించారు. ఈ మొత్తం ప్రకటనలలో డొల్లతనాన్ని పహల్‌గాం ఉగ్రవాద దాడి బట్టబయలు చేసింది.

పహల్‌గాం విషాదఘటన చోటు చేసుకోవడం వెనుక కేంద్రప్రభుత్వం ఇంటిలిజెన్స్, భద్రతా వైఫల్యం ఉంది. ఈ వైఫల్యాలకు తోడు మరింత లోతైన కారణాలు కూడా ఉన్నాయి. స్థానిక ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, వారి సహకారం లేకుండా ఏ దేశం కూడా ఉగ్రవాదాన్ని నిర్మూలించలేదు. గత పదేళ్ళుగా మోడీ ప్రభుత్వం జమ్ము-కశ్మీర్ రాష్ట్ర ప్రజానీకం పట్ల వ్యవహరిస్తున్న శైలి శృతిమించిన మూలంగా ప్రజలు పరాయీకరణకు గురయ్యారు. దశాబ్దాల కాలంగా కశ్మీర్ ప్రజానీకం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను సహానుభూతితో అర్థం చేసుకుని, నిజాయితీగా ఆ సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యడానికి బదులుగా భద్రతా చర్యల పేరిట క్రూరమైన నిర్బంధానికి పూనుకుంటున్న మూలంగా సీమాంతర ఉగ్రవాద శక్తుల మూలాలను తుదముట్టడించడం సాధ్యపడడం లేదు. పైగా ఇది పాకిస్థాన్ ఆర్మీ మరియు అక్కడ పాలకవర్గాలచే మరింత ప్రేరేపించబడుతుంది.

పహాల్గాం దాడి ఘటన అనంతరం ప్రధాని వ్యవహరించిన తీరు ఎలా ఉన్నది? సౌదీ అరేబియా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని వచ్చిన ప్రధాని తిన్నగా ఎక్కడికి వెళ్తారని ఎవరైనా భావిస్తారు. దాడి జరిగిన పహాల్గాంను సందర్శించి బాధితులకు ఓదార్పునిచ్చి, ఇలాంటి దాడికి పాల్పడిన ఘాతకుల భరతం పట్టడానికి ప్రజల సహకారం కోరతారని కదా ఎవరైనా ఆశిస్తారు. కానీ మోడీ ఏప్రిల్ 24న తిన్నగా బీహార్‌లోని మధుబనిలో ఎన్నికల ర్యాలీకి హాజరయ్యాడు. అదేరోజున ఉగ్రవాద దాడి వ్యవహారం మీద ఢిల్లీలో జరిగిన రాజకీయ పార్టీల అఖిలపక్ష

సమావేశానికి కూడా హాజరు కాలేదు. మే 8వ తేదీన రెండవసారి జరిగిన అఖిలపక్ష సమావేశానికీ గైర్హాజరయ్యాడు. మే 25న ఢిల్లీలో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి మాత్రం హాజరయ్యాడు. కానీ ఆ సమావేశానికి యన్.డి.ఎ.యేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించలేదు. దేశ ప్రధానిగా కాకుండా బిజెపి ప్రధానిగా వ్యవహరించాడు.

పహాల్గాం దాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన భారత సైనిక బలగాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగంలోని తొమ్మిది అనుమానిత ఉగ్రవాద శిబిరాల మీద క్షిపణులతో దాడి చేశాయి. దీనికి ప్రతిగా పాకిస్థాన్ సైనిక బలగాలు ఎదురుదాడికి దిగాయి. నాలుగు రోజులపాటు, మే 10 వరకు ఈ ఘర్షణలు కొనసాగాయి. ఇరువైపులా సైనిక, పౌర నష్టాలు జరిగాయి. పూంచ్, రాజౌరి, తదితర సెక్టార్ల మీద పాకిస్థాన్ బలగాలు బాంబుల వర్షం కురిపించిన మూలంగా ఆయా ప్రాంతాలలోని పేద రైతాంగం ఇండ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

యుద్ధం పేదల జీవనోపాధిని, జీవితాలను దెబ్బతీస్తుంది. ఆయుధ వ్యాపారుల బొక్కసాలు నింపుతుంది. ఉగ్రవాద సమస్యను యుద్ధాల ద్వారా అధిగమించిన సందర్భం ప్రపంచంలో ఎక్కడా కానరాలేదు. వీటన్నింటి దృష్ట్యా సైనిక దాడులను యుద్ధంగా మలచకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వాన్ని సి.పి.ఐ(యం) హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో మే 10వ తేదీన ఇరు దేశాలూ తక్షణ కాల్పుల విరమణ ప్రకటించడంతో శాంతి నెలకొనడం ఆహ్వానించదగిన పరిణామం. అయితే ఈ కాల్పుల విరమణ గురించి భారత్–పాక్ ప్రభుత్వ వర్గాల నుండి కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక 'ట్వీట్' ద్వారా ప్రకటించడం అనేది అనూహ్యమైన, అసంగతమైన సంఘటన. తదనంతరం ట్రంప్ ఈ కాల్పుల విరమణను పాటింపచేసానని ఏడుసార్లు ప్రకటించారు. వాణిజ్యపరంగా, ఆర్థికపరంగా దెబ్బ తింటారని హెచ్చరించడం ద్వారా ఇరు దేశాలనూ కాల్పుల విరమణకు అంగీకరించేలా చేసానని కూడా చెప్పుకొచ్చాడు. ట్రంప్ ప్రపంచమంతా ఈ రకంగా ప్రచారం చేస్తుంటే మన ప్రభుత్వం పల్లెత్తు మాట అనకుండా సందేహాస్పద మౌనం పాటించింది. ఈ మౌనం వెనుక ప్రజావంచన దాగి వున్నది. మన దేశ అంతర్గత వ్యవహారాలలో, మన విదేశాంగ విధానంలో తొలిసారిగా పరాయి దేశం జోక్యాన్ని మోడీ సర్కారు అనుమతించి తీవ్ర తప్పిదం చేసింది.

ఆ నాలుగు రోజుల యుద్ధకాలంలోనూ, పాక్‌తో సాయుధ సైనిక ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలోనూ, దానికి ముందూ, తర్వాత కూడా మోడీ అనుకూల వార్తా, ప్రసార సాధనాలు మన దేశానికి తలొంపులు తెచ్చే రీతిలో వ్యవహరించాయి. యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి తప్పుడు కథనాలను ప్రచారంలో పెట్టాయి. కరాచీ నౌకాశ్రయం మీద భారతసైన్యం దాడి చేసిందనీ, లాహోర్‌ను ఆక్రమించుకున్నదనీ, పాక్ రాజధాని ఇస్లామాబాద్‌ను స్వాధీనం చేసుకునే దిశగా కదులుతున్నదనీ కట్టుకథలు అల్లి జనంలోకి వదిలాయి. దీనిమూలంగా మన దేశం అంతర్జాతీయ సమాజం ముందు నవ్వుల పాలయ్యింది. బిజెపి నియంత్రణలో ఉన్న ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో కూడా 'గోడి' మీడియా కథనాలనే జోరుగా ప్రచారంలో పెట్టారు.

ఇంతకన్నా దుర్మార్గం ఏంటంటే బిజెపి కనుసన్నల్లో నడిచే కార్పొరేట్ వార్తా, ప్రసార, సామాజిక మాధ్యమాలలో ముస్లింల మీదా, ప్రత్యేకించి కశ్మీరీల మీదా అలవిమాలిన రీతిలో విద్వేషప్రచారం కొనసాగించాయి. పహల్‌గావ్ ఉగ్రవాద దాడి జరిగిన మరుక్షణం నుండే ఆర్.యస్.యస్., బిజెపి వాటి ఉపాంగాలు ప్రణాళికాబద్ధంగా ఇలాంటి విద్వేష ప్రచారానికి పూనుకుని మతపరమైన ఉద్రిక్తతలు, విభజనలు రెట్టగొట్టడానికి కృషి చేశాయి. మత విద్వేషమే పెట్టుబడిగా మనుగడ సాగించే ఆర్.యస్.యస్, బిజెపిలు దారుణమైన ఉగ్రవాద దాడి ఘటనను కూడా తమ హేయమైన రాజకీయాలు సంఘటిత పరచుకోవడానికి వాడుకోవడం అత్యంత హీనమైన చర్య.

పహల్‌గావ్ విహారయాత్రకు భార్యాసమేతంగా విచ్చేసిన నావికాధికారి వినయ్ నర్వాల్ ఈ దాడిలో మృతిచెందారు. భర్తను కోల్పోయిన నూతన వధువు హిమాంశీ నర్వాల్ ఈ దుర్ఘటనకు ముస్లింలను, కశ్మీరీ ప్రజానీకాన్ని బాధ్యులను చెయ్యకండి అన్న విజ్ఞప్తిని అడ్డం పెట్టుకొని సోషల్‌మీడియాలో ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ నీచమైన ప్రచారానికి తెగబడ్డారు. అలాగే ఈ దాడి ఘటనలో తన తండ్రి ఎన్. రామచంద్రన్‌ను కోల్పోయిన కేరళ యువతి ఆరతి మీనన్, 'నేను తండ్రిని కోల్పోయాను. కానీ, ఈ దాడి నుండి మమ్మల్ని కాపాడిన ముసాఫర్, సమీర్‌ల రూపంలో ఇద్దరు సోదరుల అండను పొందాను' అని ప్రకటించినందుకు గానూ ఆమె మీద కూడా ఇలానే నీచానికి తెగబడి ప్రచారం చేసారు. మధ్యప్రదేశ్‌లో ఎనిమిదిసార్లు శాసన

సభ్యుడిగా గెలిచి ఆ రాష్ట్ర మంత్రి పదవిలో ఉన్న కున్వన్ విజయ్‌షా సీనియర్ సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషిని ఉద్దేశించి అవాకులు చెవాకులు పేలాడు. ఈ వదరుబోతు మీద కేసు కట్టండి అని ఆ రాష్ట్ర హైకోర్టు స్వయానా ఆదేశాలు జారీ చేసింది. సోనేపల్‌లోని అశోక విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ మహబూబాబాద్ ఫేస్‌బుక్ పోస్టును సాకుగా చూపి బిజెపి పాలిత హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా ఆయన్ని అరెస్టు చేసింది. ఈ సైనిక ఘర్షణలలో భారత్ ఒక రాఫెల్ యుద్ధ విమానాన్ని కోల్పోయింది అన్న వార్తను ప్రచురించినందుకు గాను వెబ్ పత్రిక 'దవైర్'ను నిలిపివేసింది. కాల్పుల విరమణ ప్రభుత్వ రాజకీయ నిర్ణయం. అయినా ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాపరంగా ప్రకటించిన విదేశాంగ కార్యదర్శి 'మిస్రీ' మీదా, ఆయన కుమార్తె మీదా సామాజిక మాధ్యమాల్లో అవహేళనా పూర్వకంగా ప్రచారం సాగించారు.

కాల్పుల విరమణానంతరం మే 12వ తేదీన ప్రధాని నరేంద్రమోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ 'ఉగ్రవాద మౌలిక సౌకర్యాలను మనం పెద్ద ఎత్తున ధ్వంసం చేసేసాం. ఉగ్రవాదులను ఏరిపారేసాం. పాకిస్థాన్ నడిబొడ్డున ఉన్న ఉగ్రవాద స్థావరాలను సర్వనాశనం చేసేసాం' అంటూ ప్రకటించాడు. 2019లో బాలాకోట్ మీద సర్జికల్ దాడులు చేసిన తదనంతరం కూడా మోడీ ఇవే మాటలు చెప్పారు. అంటే ఇదంతా ఆర్భాటపు ప్రచారమే తప్ప నిజాయితీతో కూడినది కాదు అని తేలిపోయింది.

తన ప్రసంగానికి కొనసాగింపుగా మోడీ మూడు సూత్రాల ప్రకటన కావించాడు. "భవిష్యత్తులో ఎటువంటి ఉగ్రవాద దాడి జరిగినా తిరుగులేని విధంగా బదులు చెబుతాం. ఉగ్రవాదం తలెత్తడానికి కారణమైన మూలాలు ఎక్కడున్నాయో కనిపెట్టి అణువణువునా ప్రతీకార దాడులు చేపడతాం. ఇక రెండవ అంశం – భారతదేశం అణ్వాయుధ బెదిరింపులను సహించదు. ఆ పేరిట ఉగ్రవాద రహస్య స్థావరాలను కాపాడుకోవాలనుకుంటున్నారేమో, భారతదేశం అలాంటి స్థావరాల మీద గురిగా, నిర్ణయాత్మకంగా దాడి చేస్తుంది. మూడవ అంశం – ఉగ్రవాదం వెనుక ఉన్న నేతలను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి మధ్యన భారతదేశం అభేదాన్ని పాటించదు" అని పరోక్షంగా పాక్‌ను హెచ్చరించాడు.

బిజెపి ప్రభుత్వం ప్రవచిస్తున్న ఈ నయా సిద్ధాంతాలు భారతదేశ వ్యూహాత్మక, రక్షణ విధానాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. దేశీయంగా రాజకీయ ప్రయోజనాలను

ఆశించి మోడీ చేసిన ఈ జిమ్మిక్కు ప్రకటనలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఎందుకూ కొరగావు. ఇవే మాటలను ఆచరణలో పెడితే అవి మన దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతియ్యడమే కాకుండా, మనదేశ అంతర్జాతీయ ప్రతిష్ఠనూ మసకబారుస్తుంది.

జూన్ 10,11 తేదీలలో సి.పి.ఐ(యం) ప్రధాన కార్యదర్శి యం.ఎ.బేబీ నాయకత్వాన పార్టీ కేంద్రకమిటీ సభ్యులు మొహమ్మద్ యూసఫ్ తరిగామి, పార్లమెంట్ సభ్యులయిన అమరారామ్, కె.రాధాకృష్ణన్, సువెంకటేశన్, జాన్ బ్రిట్టాస్, బికాశ్ రంజన్ భట్టాచార్య, ఎ.ఎ.రహీమ్‌లతో కూడిన ప్రతినిధుల బృందం శ్రీనగర్‌ను సందర్శించింది. పహల్‌గావ్ ఉగ్రవాద దాడిని నిరసించి, మత సామరస్యం సందేశాన్ని వ్యాప్తి చెయ్యడానికి కృషి చేసిన జమ్ము–కశ్మీర్ ప్రజానీకాన్ని కలిసింది. పర్యాటకుల ప్రాణాలు కాపాడే క్రమంలో అసువులు బాసిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్‌షా కుటుంబాన్ని పరామర్శించింది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బహుముఖ వ్యూహం అవసరం. ఈ కింద పేర్కొన్న అంశాలు ఆ వ్యూహంలో భాగం కావాలి –

1. పహల్‌గావ్ దాడికి తెగబడిన ఉగ్రవాదులను బంధించి చట్టప్రకారం శిక్షించాలి. పహల్‌గావ్ ఘటన, అంతకు ముందు జరిగిన పుల్వామా దాడులు – రెండూ కూడా మన ఇంటలిజెన్స్, భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. తక్షణమే ఈ వైఫల్యాలను సరిదిద్దుకునే చర్యలు చేపట్టాలి. అణ్వస్త్రాలు కలిగిన రెండు దేశాల మధ్యన సైనిక చర్యలు ఉగ్రవాద సమస్యను పరిష్కరించజాలవు. రాయబార, ఆర్థిక మార్గాల ద్వారా ఈ సమస్య పరిష్కారానికి గట్టిగా కృషి చెయ్యాలి. 2008లో ముంబై దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టి, పవల్‌గావ్ దాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయానికి సంబంధించి సాక్ష్యాలను పక్కాగా సేకరించి పాకిస్థాన్‌ను ఒంటరిపాటు చేయాలి.
2. ఈ ఆధారాలు ఆధారంగా 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్' వద్ద కేసు బనాయించాలి. ముందు పక్కా సాక్ష్యాలు సమర్పించి ఉగ్రవాద ముఠాలకు పాకిస్థాన్ సాయం అందనీయకుండా చెయ్యాలి. 2012 నుండి 2022 వరకు పాకిస్థాన్‌ను 'గ్రే' లిస్టులో నిలిపి ఉంచడం ద్వారా

ఉగ్రవాదులకు ఆర్థికసాయం అందనీయకుండా నిలవరించడం సాధ్యపడింది. కానీ, ఇవాళ పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 25 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉన్న ఐ.యం.ఎఫ్ బోర్డు సమావేశం తాజాగా మనదేశం గైర్హాజరీ మినహా మిగిలిన 24 మంది సభ్యులు పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల బెయిల్-అవుట్ ప్యాకేజీని అందించడానికి ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుండి భారీ మొత్తంలో ఆర్థిక సాయాన్ని అందుకున్నది. ఐక్యరాజ్యసమితిలో ఉగ్రవాద వ్యతిరేక కమిటీ సభ్యురాలిగా స్థానం సంపాదించింది. దక్షిణాసియా ఖండంలో మన పొరుగున ఉన్న దేశాలు పహాల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించాయి కానీ పాకిస్థాన్‌పై మన దేశం చేపట్టిన సైనికచర్యకు ఏ దేశమూ మద్దతుగా నిలబడలేదు. విదేశాంగ విధానంలో మన దేశం ఎంత ఒంటరిపాటు అయింది అనేదానికి ఇదొక స్పష్టమైన ఉదాహరణ. ఈ పరిణామాలు అన్నీ దృషిలో పెట్టుకుని మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన సింధూ జలాల ఒప్పందం నిలిపివేత చర్యలో ఇమిడివున్న న్యాయపరమైన, దౌత్యపరమైన, మానవీయ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

3. ఉగ్రవాదాన్ని అణిచివెయ్యాలంటే ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం జమ్ము-కశ్మీర్ ప్రజలలో నెలకొన్న పరాయీకరణ భావాన్ని పూర్తిగా తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలి. తక్షణమే జమ్ము-కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన స్వయం ప్రతిపత్తిని కల్పించాలి. ప్రజలపై కొనసాగిస్తున్న రాజ్య నిర్బంధాన్ని తక్షణమే నిలిపివెయ్యాలి. ప్రజల ప్రజాస్వామిక, పౌరహక్కులను, పత్రికా స్వాతంత్ర్యాన్ని తక్షణమే పునరుద్ధరించాలి. సున్నితమైన ఈ సరిహద్దు రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి తగిన చర్యలు చేపట్టాలి. తద్వారా కశ్మీరీ యువకులు ఉగ్రవాద శక్తుల ప్రభావంలో పడకుండా నిరోధించి, ఉగ్రవాద మూలాలను దెబ్బతియ్యవచ్చు.

4. ఈ వ్యూహంలో భాగంగా మతపరమైన రాజకీయ లబ్ధిని ఆశించి ప్రచార, ప్రసార, సామాజిక మాధ్యమాలలో దేశవ్యాప్తంగా ముస్లిం ప్రజానీకాన్ని

లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న దుష్ప్రచారాలను, దాడులను కట్టడి చేసి, విద్వేష ప్రచార శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి.

5. పహల్‌గావ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి, తదనంతరం పరిణామాలపై ఏకాభిప్రాయం సాధించడానికి ప్రజాస్వామిక చర్చ అవసరమని, అందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని సి.పి.ఐ(యం) తదితర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న సూచనకు మోడీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, రాజకీయ విజ్ఞతను ప్రదర్శించాలి. ఈ డిమాండ్స్‌కు దేశవ్యాప్తంగా ప్రజలు గట్టిగా మద్దతు ఇవ్వాలి.

మత విద్వేష ప్రచారం ద్వారా దేశ సమగ్రతను, ప్రజల మధ్య నెలకొన్న ఐక్యతను దెబ్బ తియ్యడానికి ప్రయత్నిస్తున్న చీకటి శక్తుల పట్ల ప్రజాస్వామిక వాదులు అప్రమత్తంగా ఉండాలని, ఉగ్రవాదాన్ని దీటుగా ఎదుర్కోవడానికి సి.పి.ఐ(యం) ప్రతిపాదించిన పంచసూత్ర కార్యాచరణను మోడీ ప్రభుత్వం చేపట్టేలా ఒత్తిడి తీసుకురావడానికి ప్రజలందరూ సహకరించాలని సి.పి.ఐ(యం) విజ్ఞప్తి చేస్తుంది.

# నిరంతర యుద్ధం - మోడీ కొత్త సిద్ధాంతం

**- ప్రకాశ్ కరత్,** సిపిఐ(ఎం) పూర్వ ప్రధాన కార్యదర్శి

ఆపరేషన్ సిందూర్ ముగిసిన తరువాత మే 12వ తేదీన ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ మూడు మార్గదర్శకాలతో కూడిన కొత్త సిద్ధాంతాన్ని ప్రకటించారు. దేశ భద్రతకు సంబంధించి అనుసరించబోయే విధివిధానాలు, వ్యూహాల మీద గాఢమైన ప్రభావం చూపించనున్న ఈ కొత్త సిద్ధాంతాన్ని మనం సమగ్రంగా విశ్లేషించి అర్థం చేసుకోవాలి.

మోడీ ప్రవచించిన మూడు మార్గదర్శకాల్లో మొదటి అంశం – భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా అందుకు ధీటుగా బదులిస్తాం. ఉగ్రవాదం మూలాలున్న ప్రతి ప్రాంతం మీదా ప్రతీకార చర్యలు చేపడతాం.

రెండవ అంశం–అణ్వాయుధ దాడి పేరిట బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడితే భారతదేశం ఎంత మాత్రం సహించదు. ఈ సాకున రక్షణ కల్పిస్తున్న ఉగ్రవాదుల రహస్య స్థావరాల మీద ఖచ్చితత్వంతో కూడిన నిర్ణయాత్మక దాడులు చేస్తాం.

మూడవ అంశం–ఉగ్రవాద చర్యల వెనుక ఉన్న పెద్ద తలకాయలకు, ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేస్తున్న ప్రభుత్వానికి మధ్యన ఎలాంటి తేడా లేదని భారతదేశం పరిగణిస్తుంది.

ఈ అంశాలను ప్రస్తావించడానికన్నా ముందు–'మే 10వ తేదీ మధ్యాహ్నం నాటికి మనం ఉగ్రవాద మౌలిక సౌకర్యాల వ్యవస్థను పెద్ద ఎత్తున ధ్వంసం చేశాం. ఉగ్రవాదులను ఏరిపారేశాం. పాకిస్తాన్ నడిబొడ్డున నెలకొల్పిన ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశాం. తదనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడబోం, అలానే సైనిక చర్యకు పాల్పడే ఆలోచన చెయ్యం–అని చెప్పుకొచ్చాక మన దేశం ఈ మాటలను మన్నించింది (సైనిక చర్యను విరమించింది).' అని మోడీ చెప్పుకొచ్చారు. దీనికి ముక్తాయింపుగా 'పాకిస్తాన్ ఉగ్రవాద, సైనిక స్థావరాల మీద ప్రతీకార దాడులను తాత్కాలికంగా నిలుపుదల చేశాం' అని మోడీ వివరించారు.

## కాళ్లూచేతులూ కట్టేసినట్టు

ప్రతి ఉగ్రవాద చర్యకు ప్రతీకార దాడులతో బదులు ఇస్తామని ప్రకటించడమంటే ఉగ్రవాద సమస్య పరిష్కారానికి ఎంచుకోవాల్సిన అనేక మార్గాలను మనంతట మనమే

మూసేసుకున్నట్లే. మన దేశ వ్యూహాత్మక ప్రతిస్పందనను గుప్పెడు ఉగ్రవాదుల మూక చేతులకు అప్పగించినట్లే. ఇదే మన దేశం ఎంచుకున్న విధానమైతే ఏ ఉగ్రవాదుల గుంపయినా ఉగ్రవాద చర్యకు పాల్పడి పాకిస్తాన్‌తో సైనిక ఘర్షణను ప్రేరేపించడానికి మన దేశాన్ని ఉచ్చులోకి లాగే అవకాశం ఉంటుంది.

మోడీ ప్రకటనలోని సారాంశాన్ని విశ్లేషిస్తూ ప్రముఖ భద్రతా వ్యవహారాల నిపుణుడు అజరు సాహ్ని 'ఫ్రంట్‌లైన్' పత్రిక (2025 మే 25 సంచిక)లో ఒక వ్యాసం రాశారు. 'భారత గడ్డ మీద భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా దానిని యుద్ధ చర్యగా పరిగణిస్తాం' అని ప్రకటించడమంటే 'ఆపరేషన్ సిందూర్' వంటివి సర్వసాధారణంగా మారిపోతాయి. 'ఫలానా స్థాయి' అన్న అంచనా లేకుండా ప్రతి ఉగ్రవాద చర్యకి వ్యతిరేకంగా మన దేశం సైనిక చర్యకు పాల్పడేలా ప్రేరేపించే ఉచ్చులో చిక్కుకు పోతాం' అని అజరు సాహ్ని హెచ్చరించారు.

'ఆపరేషన్ సిందూర్'ను హఠాత్తుగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ప్రధాని మోడీ బిజెపి తరపున చేపట్టిన రాజకీయ ప్రచార సభలన్నింటా 'అపరేషన్ సిందూర్' పూర్తయినట్లు కాదు. తాత్కాలికంగా అపాం' అని ప్రసంగించారు.

ఇక్కడో ప్రశ్న తలెత్తుతుంది. జాతినుద్దేశించి ప్రసంగించే క్రమంలో మోడీ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను, ఉగ్రవాదుల మౌలిక సౌకర్యాలను ధ్వంసం చేశామని ప్రకటించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అవే చిలుక పలుకులు పలికారు. ఆపరేషన్ సిందూర్ అనుకున్న లక్ష్యాలు సాధించడంలో విజయం సాధించిందని మోడీ చేసిన ప్రకటన వాస్తవమైతే భవిష్యత్తులో కూడా ఇలానే సైనిక దాడులకు పాల్పడతాం అని హెచ్చరించడంలో అర్థం ఏముంది! ఇదంతా ముగింపు లేని యుద్ధ వాతావరణాన్ని సృష్టించడానికి దారితీయదా? భద్రతా వ్యవహారాల విషయంలో మనం ఒక మూసకట్టు వ్యూహంలోకి జారిపోవడం సరైనదేనా?

ఇదంతా చూస్తుంటే పైపై ఆర్భాటమే తప్ప వాస్తవం కాదనిపించడం లేదూ. మోడీ పరిపాలనలో ఇలాంటి ఆర్భాటపు ప్రచారాలకు, ప్రకటనలకు కొదవలేదనుకోండి. ఉగ్రవాదుల స్థావరాలన్నీ ధ్వంసం చేశాం, వంద మంది ఉగ్రవాదులను తుద ముట్టించాం అంటూ మోడీ చేసిన ప్రకటన చూస్తుంటే ప్రజల ముందు గొప్పలు చెప్పుకోవడానికేనేమో అన్న అనుమానం తలెత్తుతున్నది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి తర్వాత ప్రభుత్వం తరపున అధికారికంగా మాట్లాడిన నాయకులందరూ దాయాది దేశం మీద ఈసారి మనం చేపట్టబోయే

సైనిక చర్య బాలాకోట్ సర్జికల్ దాడులకు మించిన స్థాయిలో ఉంటుందని ప్రకటిస్తూ వచ్చాయని రక్షణ వ్యవహారాల నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత రెండు వారాలకు ప్రభుత్వం సైనిక చర్య చేపట్టింది. ముందు నుండీ దాడులు చేస్తాం అని భారత ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల దృష్ట్యా ఉగ్రవాద శక్తులు తప్పించుకునే మార్గం చూసుకోకుండా భారత ప్రభుత్వం చేసే దాడుల్లో హతమైపోదామని నిర్ణయించుకుని అవే తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను అంటిపెట్టుకుని ఉన్నారని మనం భావించాలా? శత్రువు దాడి చేస్తాడన్న సమాచారం ముందుగానే అందాక ఎవరన్నా ఉన్నచోటే శిలేసుకు కూర్చుంటారా? ఉండరు కదా! కాబట్టి మోడీ ప్రభుత్వం చేసే ప్రచారం బూటకం అని తేలుతుంది. కాకపోతే ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత ప్రభుత్వం పాకిస్తాన్ భూభాగంలోని లక్ష్యాల మీద దాడి చేయడానికి సందేహించదన్న కృతనిశ్చయాన్ని ప్రకటించగలిగింది.

### అణ్వాయుధ వాస్తవాలు

అణ్వాయుధం పేరిట బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడితే భారతదేశం ఎంతమాత్రమూ సహించదు. ఈ సాకున రక్షణ కల్పిస్తున్న ఉగ్రవాదుల రహస్య స్థావరాల మీద ఖచ్చితత్వంతో కూడిన నిర్ణయాత్మక దాడులు చేస్తాం అంటూ మోడీ చేసిన లక్ష్మణ రేఖ ప్రకటన పూర్తిగా బాధ్యతా రహితమైనది, డంబాల మారిది. రెండు అణ్వాయుధ దేశాలు యుద్ధానికి తలపడితే అది ఎలాంటి పర్యవసానాలకు దారి తీస్తుందో, ఎక్కడ అణ్వా యుధాల ప్రయోగానికి ప్రేరేపిస్తుందో అని ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతాయి. యుద్ధానికి పాల్పడిన అణ్వాయుధ దేశాల మీద యుద్ధ విరమణ కోసం ఒత్తిడి తెస్తాయి. రక్షణ వ్యవహారాలపై సింగపూర్‌లో జరిగిన సదస్సుకు హాజరైన మన త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ అక్కడ ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "అణ్వాయుధ స్థాయి కన్నా ముందు సంప్రదాయ పద్ధతుల్లో యుద్ధం చేయడానికి అవకాశాలున్నాయి. అలా కాకుండా రెచ్చగొట్టే ధోరణులకు పోతే కొద్ది గంటల వ్యవధిలోనే పరిస్థితులు చేజారిపోతాయి" అని వివరించారు. అంటే పాక్‌తో తాజాగా తలెత్తిన ఘర్షణలలో అణ్వాయుధ ప్రయోగం బెదిరింపులు చోటుచేసుకుని వుండవు. బహుశా ఇరు పక్షాలనూ తగ్గమని అమెరికా అధికార యంత్రాంగం నచ్చ చెప్పే ప్రయత్నంలో ట్రంప్ యంత్రాంగం అణ్వాయుధ బూచిని తురుపు ముక్కగా వాడి ఉండవచ్చు. సహజంగానే ట్రంప్ అధిక ప్రసంగి. భారత్-పాక్ అధికార వర్గాలతో మధ్యవర్తి చర్చలు చేసిన అమెరికన్ ఉపాధ్యక్షుడు, విదేశాంగ శాఖా మంత్రి తమ జోక్యాన్ని సమర్థించుకోవడానికి అణ్వాయుధ ప్రయోగ ప్రమాదం ఉందన్న సమాచారం

తెలిసి మేం వేంటనే రంగంలోకి దిగాల్సి వచ్చిందని వార్తా సంస్థలకు వివరించడం మనం చూశాం.

ఉగ్రవాదాన్ని ఎదిరించడానికి, తుదముట్టించడానికి పూర్తిగా సైనిక చర్యల మీద ఆధారపడాలనే తప్పుడు వ్యూహం మూలంగా తలెత్తే ప్రమాదాలు ఇలానే ఉంటాయి.

ఇక ఉగ్రవాద చర్యల వెనుక ఉన్న పెద్ద తలకాయలకు, ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేస్తున్న ప్రభుత్వానికి మధ్యన ఎలాంటి తేడా లేదని భారతదేశం పరిగణిస్తుందన్న మోడీ ప్రకటన విషయానికి వద్దాం. తీవ్రఇస్లాం వాదంతో ప్రేరేపితమైన ఉగ్రవాద ముఠాలకు పాకిస్తాన్ ప్రభుత్వం వివిధ మార్గాల్లో సాయం అందిస్తుందని మనం నిస్సందేహంగా గుర్తించవచ్చు. పాకిస్తాన్ పౌర ప్రభుత్వాన్ని, ఉగ్రవాద మూకల వెనుక ఉన్న పెద్ద తలకాయలను ఒకే గాటన కట్టడమంటే భవిష్యత్తులో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించు కోవడానికి ఉన్న అవకాశాలను మనంతట మనమే మూసేసుకుంటున్నట్లే. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలంటే రేపు మా గడ్డ మీద ఎలాంటి ఉగ్రవాద చర్య చోటు చేసుకున్నా మీ భరతం పడతాం అనే బెదింపు ధోరణి ఎంత మాత్రం అక్కరకు రాదు, కాగా పోగా బయట శక్తుల జోక్యానికి మనమే బాటలు వేసినట్లు అవుతుంది.

## కాశ్మీర్ ప్రజలు కీలకం

సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలంటే, ఉగ్రవాద హింసను నిలవరించాలంటే మనం జమ్ము కాశ్మీర్ ప్రజానీకాన్ని విశ్వాసంలోకి తీసుకుని ఎంత పెద్ద ఎత్తున సమీకరించగలుగుతాం అనేది కీలకం. ఈ దిశగా ఏమేరకు మనం కృషి చేస్తే ఆ మేరకు ఉగ్రవాదం మీద విజయం సాధిస్తాం. పహల్గాం దాడి అనంతరం కాశ్మీర్ సాధారణ ప్రజానీకం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున స్పందించారు. ఆర్టికల్ 370 రద్దు చేసి తమ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని మోడీ ప్రభుత్వం దెబ్బ తీసిందని కాశ్మీర్ ప్రజానీకం ఆగ్రహంతో ఉన్నా, ఈ ప్రభుత్వ హయాంలో మరింత పరాయీకరణకు లోనయ్యామన్న ఆక్రోశం ఉన్నప్పటికీ అక్కడి ప్రజానీకం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలకు పూనుకోవడం చిన్నా చితకా విషయం కాదు. ఈ సందర్భాన్ని ఉపయోగ పెట్టుకుని కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాని పునరుద్ధరించి ప్రజానీకం విశ్వాసం చూరగొనడానికి మోడీ ప్రభుత్వ ప్రయత్నించి ఉండాల్సింది. కానీ కేంద ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించింది. కాశ్మీర్ ప్రజలపై మరింత తీవ్ర నిర్బంధానికి పాల్పడింది. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే

పేరిట వేలాది మందిని అదుపులోకి తీసుకున్నది. ఉగ్రవాదుల కుటుంబాల ఆవాసాలను కూల్చింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరిట ఒక ప్రాంత ప్రజానీకంపై ఇంత పెద్ద ఎత్తున రాజ్య అణిచివేతకు పాల్పడడం మోడీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణులకు అద్దం పడుతున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన రాజకీయ చర్యలు చేపట్టి వారిని తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో భాగస్వాములను చెయ్యడానికి బదులుగా మోడీ ప్రభుత్యం అణిచివేతను సాధనంగా చేసుకోవడం దిగ్భ్రాంతికరం.

సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ, దౌత్య, ఆర్థిక, రక్షణ పరమైన చర్యలను కలివిడిగా చేపట్టడమే సరైన విధానం. ఉగ్రవాద వ్యతిరేక రక్షణ వ్యవస్థలను, ఇంటిలిజెన్స్ పని తీరును మరింత మెరుగు పరుచుకోవడానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలి. పహల్గాం దుర్ఘటనకు కారణమైన భద్రతా వ్యవహారాల వైఫల్యం నుండి సరైన గుణపాఠం తీసుకోవాలి.

## పాకిస్తాన్‌ను ఏకాకి చెయ్యలేకపోయాం

పహల్గాం దాడి ఘటన జరిగి ఇన్ని వారాలు గడిచాక కూడా అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్‌ను మనం రాజకీయ పరంగా దౌత్యపరంగా ఒంటరిపాటు చెయ్యలేకపోయాం. పాక్ తాజాగా ఐ.ఎం.ఎఫ్ నుండి రుణం దక్కించుకున్నది. ఇది చాలదన్నట్లు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి కూడా రుణాలు పొందనున్నది. అన్నిటికీ మించి ఐక్యరాజ్యసమితిలో ఉగ్రవాద సంబంధిత, ఉగ్రవాద వ్యతిరేక కమిటీలకు ప్రతినిధి దేశంగా పాకిస్తాన్ ఎన్నికైంది.

పాకిస్తాన్ మీద మన దేశం చేపట్టిన సైనిక చర్యకు దక్షిణాసియా దేశాలు కానీ మన ఇరుగు పొరుగు దేశాలు కానీ మనకు మద్దతుగా నిలబడకపోవడం ప్రభుత్వ అతి పెద్ద వైఫల్యం. నేపాల్, శ్రీలంక ప్రభుత్వాలు పహల్గాం దాడులను తీవ్రంగా ఖండించాయి. కానీ పాకిస్తాన్‌లో నాలుగు రోజుల పాటు దాడులకు దిగిన నేపథ్యంలో తటస్థ వైఖరి పాటించాయి. సింధూనదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శ్రీలంక రాజకీయ, ప్రభుత్వ పక్షాలలో సందేహాలకు దారి తీసింది. ఇంధన రంగం, మౌలిక సౌకర్యాల కల్పన తదితర రంగాలలో భారతదేశంతో కుదుర్చుకోనున్న ఒప్పందాలపై అనుమానపు నీలినీడలు కమ్ముకున్నాయి. మోడీ ప్రభుత్వ వ్యవహార శైలి పొరుగు దేశాల్లో మరిన్ని అనుమానాలకు దారితీసేలా ఉందే తప్ప మోడీ ప్రవచించిన సిద్ధాంతం ప్రయోజనకారిగా లేదు.

## సంకుచిత రాజకీయ ప్రయోజనాలు

ఆపరేషన్ సిందూర్‌ను తన పాక్షిక, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి నిస్సిగ్గుగా వాడుకుంటున్న తీరుగానీ, మన సైనిక బలగాలకు బదులుగా ఆపరేషన్ ఖ్యాతి అంతా తనదే అన్నట్లు మోడీ వ్యవహరిస్తున్న తీరుగాని చూస్తే ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పేరిట మోడీ, బిజెపిలు దేశంలో ఉన్మాదం రెచ్చగొట్టడానికి, అన్య మతస్తులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడుతూ హిందూ ఓటు బ్యాంకును సంఘటితం చేసుకోవాలనే రాజకీయ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి చూస్తున్నదన్న అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయి.

మోడీ ప్రవచనాలు దేశీయంగా రాజకీయ సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఉద్దేశించినవే తప్ప వేరు కాదు. నిజంగానే మోడీ ప్రకటించిన మూడు లక్ష్య ప్రకటనలను ఆచరణలో పెడితే అవి స్వీయ హానికి దారి తియ్యడంతో పాటు, మన దేశాభివృద్ధికి అంతర్జాతీయ సమాజంలో మెరుగైన గుర్తింపుకి చేటు చేస్తాయి.

***


ప్రతులు : 2000    ప్రచురణ కాలం : జూలై, 2025    వెల : రూ. 5/-

ముద్రణ : ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై.లి. విజయవాడ

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2

ఫోన్ నెం. 0866-2577202